క్లుప్తంగా

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

వినుకొండ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలం దర్శనానికి వినుకొండ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి 21 సోమవారం తిరుత్తణి శ్రీ కుమారస్వామి వారి దర్శనం, 12 గంటలకు శివకంచి, విష్ణుకంచి దర్శనం, 21 సోమ వారం రాత్రి అరుణాచలం దర్శనం చేసుకొని గిరి ప్రదక్షణ పూర్తి చేసి 22న మంగళవారం ఉదయం గోల్డెన్ టెంపుల్, మధ్యాహ్నం 3 గంటలకు కాణిపాకం వినాయకుని దర్శనం అనంతరం తిరిగి 23 ఉదయం 4 గంటలకు వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.2550లు నిర్ణయించామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా క్షేత్రాల తీర్థయాత్రలకు నెల 11వ తేదీన శుక్ర వారం రాత్రి 9 గంటలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహానంది, బనగానపల్లె, నేలమట్టం ఆశ్రమం, యాగంటి, అహోబిలం, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, కాశీనాయన జ్యోతిమఠం క్షేత్రాల సందర్శన అనంతరం 14 సోమవారం ఉదయం 5గంటలకు వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. టిక్కెట్ ధర రూ.1600లు నిర్ణయించడమైందని, మరిన్ని వివరాలకు ఆర్టీసీ డిపోలో సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీలో పశువులకు నీటి తొట్టెలు

బొల్లాపల్లి : వేసవి నీటి ఎద్దడిలో పశువులకు దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఏపీవో ఎం. లక్ష్మణ రావు తెలిపారు. మంగళవారం మండలంలోని సరికొండపాలెం, వడ్డెంగుంట, పేరూరుపాడు మరికొన్ని గ్రామాల్లో తొట్టెల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మూగ జీవాలకు అనుకూలంగా నీటిసౌకర్యం ఉన్న ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ త్రైమాసికంలో పశువులకు నీటి తొట్టెలు నిర్మిస్తామని, ఉపాధి హామీ పథకంలో భాగంగా వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క నీటితొట్టికి కూలీల పరిధిలో రూ.1200లు, మెటీరియల్ కింద రూ. 31 వేలు నిధులు మంజూరయ్యాయన్నారు. 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పుతో పశువులు నీరు తాగేందుకు అనుగుణంగా వీటి నిర్మాణం ఉంటుందన్నారు.

తిరునాళ్లలో దొంగలు చేతివాటం

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెంలో గతనెల 30న జరిగిన శ్రీఅడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల వేడుకల్లో బైకులు, సెల్‌ఫోన్లు, చోరీకి గురయ్యాయి. తిరునాళ్ల వేడుకల్లో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిన కూడా దొంగలు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు చోరీ చేయటంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై లేళ్ల లోకేశ్వర రావు మాట్లాడుతూ బైకులు, సెల్‌ఫోన్లు చోరీకి గురైన వారంతా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

పెరుమాళ్ళపల్లి జగన్నాథం ఇకలేరు



నాదెండ్ల: కనపర్రు గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు తండ్రి జగన్నాథం (74) మంగళవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు సర్పంచ్‌లు, మండల నాయకులు జగన్నాథం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అబ్దుల్లాకు ఇండియా రికార్డ్ మెడల్



వినుకొండ: కర్ణాటక రాష్ట్రంలోని శ్రీకాంతిరావు స్టేడియంలో ఇండియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన పోటీలలో వినుకొండ పట్టణానికి చెందిన క్రీడాకారుడు, పరుగుల వీరుడు షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు. ఈ పోటీలు గత నెల 30, 31 తేదీల్లో జరగగా నిర్ణీత లక్ష్యం 225 కిలోమీటర్ల పోటీలలో పాల్గొని ఇండియా రికార్డ్ మెడల్ సాధించినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. మెడల్ సాధించిన అబ్దుల్లాను పలువురు అభినందించారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నేత సిలార్ మసూద్



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

నరసరావుపేట: ఆప్కాస్, ప్రైవేట్ ఏజెన్సీలు రద్దు చేసి పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ విభాగాల కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అక్కడి నుంచి మల్లమ్మ సెంటర్, కూరగాయల మార్కెట్ మీదుగా తిరిగి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో శాశ్వత స్వభావం కలిగిన పనులను నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగం కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా లోకల్ ఏజెన్సీలకు అప్పచెబితే కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2023 డిసెంబర్‌లో నిర్వహించిన 17 రోజుల సమ్మె ఒప్పందాలకు జీఓ విడుదల చేసి జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పట్టణీకరణ, జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో పనిభారం పడుతుందని దీంతో తరచూ అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరేళ్లుగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న సుమారు 40 మంది కార్మికుల చేత నెల మొత్తం పని చేయించుకుంటూ 10 నుంచి 15 రోజులకు వేతనాలు ఇవ్వడం విడ్డూరమని, వారికి చేసిన అన్ని రోజులకు ఆప్కాస్ ద్వారా వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో మిగతా పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులను కలుపుకొని ఉద్యమిస్తామని, స్పందించకపోతే మెరుపు సమ్మె చేపడతామని హెచ్చరించారు. డి.యోహాన్, పిట్ట ఏసు, జీవరత్నం, వీరకుమార్, విజయలక్ష్మి, నరసింహారావు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా పదవీ విరమణ చేయడం అభినందనీయం

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- ఏఎస్‌ఐ బెనహర్‌బాబు దంపతులకు సత్కారం


సురేంద్రనాథ్ బెనహర్‌బాబు దంపతులకు సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: పోలీస్ శాఖలో ఎన్నో ఆటుపోట్లను దాటుకుని ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందటం చాలా సంతోషకరమైన విషయమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పి.సురేంద్రనాథ్ బెనహర్‌బాబు దంపతులకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పూలమాల వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 35 ఏళ్లపాటు సుదీర్ఘకాలం వివిధ స్థాయిల్లో పోలీస్ శాఖకు సేవలందించడం సామాన్య విషయం కాదన్నారు. అప్పట్లో నక్సలిజం, అరకొర సదుపాయాలు, రవాణా సౌకర్యాల కొరత మొదలగు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందటం గొప్ప విషయమన్నారు. దీనికి వారి కుటుంబ సభ్యుల త్యాగం, సహకారం ఉండటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. కావున వారి కుటుంబ సభ్యులకు తన అభినందనలు తెలిపారు. మీ సేవలు భావితరాలకు ఆదర్శనీయమని, దేవుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తి బాబు, ఏవీ కేవీవీ రామారావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ రెడ్డి, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు టి.మాణిక్యాలరావు, హోంగార్డు, వెల్ఫేర్ ఆర్ఐలు ఎస్.కృష్ణ, ఎల్.గోపీనాథ్ పాల్గొన్నారు.

సాగర్ కాల్వలకు మరమ్మతు చేపట్టాలి

అధికారులకు ప్రజాసంఘాల వినతి


మాట్లాడుతున్న పీడీఎం నాయకులు

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాల్వ పరిధిలో ఉన్న కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టి నీరు సక్రమంగా పారేవిధంగా చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో మీడియాతో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. దశాబ్దాలు గడుస్తున్నా కాలువల రిపేర్లు చేయకుండా, ప్రతి ఏడాది బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించడం మాత్రం జరుగుతుందన్నారు. ఆ నిధులతో పనులు ఎక్కడ జరుగుతున్నాయో ఎవరికీ స్పష్టత ఉండటం లేదన్నారు. నరసరావుపేట, వినుకొండ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట ఎక్కడ చూసినా కాలువల్లో పిచ్చిచెట్లు మొలవటం, కంప చెట్లతో నిండి ఉండటం, కాలువలు తెగి ఊర్ల మీద, పంట పొలాల మీద పడటమనేది అనేకమార్లు జరుగుతున్నాయన్నారు. స్థానిక అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదన్నారు.

గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు అర్జీలిచ్చినా పరిష్కారం కావట్లేదని, ఎన్ఎస్పీ అధికారులు అంచనాలు వేసి పైకి పంపుతున్నామని, అనుమతులు, బడ్జెట్ కేటాయింపులు పూర్తికాగానే పనులు మొదలు పెడతామంటూ ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారన్నారు. కాలవలను పట్టించుకునే వాళ్లే లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో ఆక్రమణకు లోనవుతున్నాయని, ఎన్ఎస్పీ అధికార యంత్రాంగం మౌనంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి నాగార్జున సాగర్ పరిధిలో ఉన్న కాలువలు రిపేర్లు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రాము, బీసీ సంక్షేమసంఘ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశానవాటికలను శుభ్రం చేయించాలి



చిలకలూరిపేట: ఈస్టర్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో క్రైస్తవ శ్మశాన వాటికలను శుభ్రం చేయించాలని పలువురు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానిని కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 20న ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పూర్వీకుల సమాధులను అలంకరించుకోవడం ఆచారంగా వస్తున్నదని వివరించారు. పట్టణంలో ఉన్న ఐదు శ్మశానవాటికలు అపరిశుభ్రంగా ఉన్నందున వాటిని శుభ్రం చేయించటంతో పాటు శ్మశాన వాటికల్లోని బోర్లను మరమ్మతు చేయించాలని కోరారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొండా వీరయ్య, మద్దుమాల రవి, జి.మాణిక్యరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.రమేష్‌బాబు, టి.చందు పాల్గొన్నారు.

బాలికను వేధించిన కేసుపై విచారణ

నాదెండ్ల: పట్టణంలోని వివాహిత మహిళకు కొన్నాళ్లకు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత వేరే వ్యక్తితో సహజీవనం చేస్తూ మొదటి భర్తకు విడాకులు ఇచ్చింది. సహజీవనం చేస్తున్న వ్యక్తితో ఉంటూ భర్త దగ్గర ఉన్న పిల్లలని అప్పుడప్పుడు పాఠశాల వద్దకు వెళ్లి కలుస్తూ పాపని ఇంటికి తీసుకొని వస్తూ ఉండేది. ఈ క్రమంలో డిసెంబర్లో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకునే పాపని తన వద్దకు తీసుకొని వచ్చింది. ఆ తర్వాత రోజు కొడుతూ చిత్రహింసలు పెడుతూ బెల్టుతో కాళ్ళు, చేతులు మీద కొట్టటమే కాకుండా, వంటిమీద పలుచోట్ల కాలుస్తూ చిత్రహింసలకు గురి చేసేది. దూరంగా ఉన్న భర్త, నాయనమ్మ ఇంటి వద్దకు వెళ్తా ఉండగా పాపా రోడ్డుమీద ఆడుకుంటూ స్పృహ తప్పి పడిపోయి ఉండటంతో తండ్రి నాయనమ్మ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి పోలీసు మీడియాకు సమాచారం తెలియజేశారు. ఈ ఘటన నిన్న మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి కసాయితల్లి, ప్రియుడి గురించి విచారణ చేపట్టారు. మంగళవారం పల్నాడు జిల్లా డీసీపీఓ, నాదెండ్ల సీడీపీఓ పాప నివాసం వద్దకు వెళ్లి పాపకు జరిగిన అన్యాయం మీద విచారణ చేపట్టి వివరాలు సేకరించారు.

వ్యవసాయానికి పెద్ద పీట

నరసరావుపేట రూరల్: వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీటవేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని గురవాయపాలెంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏర్పాటు చేయనున్న సేద్యపు నీటి కుంట పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ వర్షపు నీటిని నీటి కుంటలో నిల్వ చేసుకోవడం ద్వారా పంటలకు అదనులో నీటి తడులను అందించవచ్చని తెలిపారు. దీంతో పాటు వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి కుంటలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి నీటి చుక్క ఎంతో విలువైనది, నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, నీటి సంఘం అధ్యక్షుడు జాగర్లమూడి హనుమంతరావు, కడియాల తాండవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లను అందరూ గౌరవించాలి

అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవం


కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ల మధ్యన కేక్ కట్ చేస్తున్న బెంజిమెన్

నరసరావుపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ ట్రాన్స్‌జెండర్లను గౌరవించాలని హాండ్స్‌ఆఫ్ కంపాషన్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమిన్ కోరారు. అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ట్రాన్స్‌జెండర్ల మధ్యన కేక్ కట్‌చేశారు. డైరెక్టర్ ఆనంద్ బెంజమిన్ మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లు అనేక సవాళ్ళు, వివక్షత ఎదుర్కొంటున్నారని, వారిని సమాజంలో మనతో సాటివారిగా చూడాలని పిలుపునిచ్చారు.

సమాన అవకాశాలు, హక్కులు వారికి ఉన్నాయని తెలియజేశారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల రక్షణ) చట్టం, 2019 అనేది ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల రక్షణ, వారి సంక్షేమం, ఇతర సంబంధిత విషయాలను అందించే లక్ష్యంతో భారత పార్లమెంట్ చేసిన చట్టమని దానిని సమాజంలో ప్రతి ఒక్కరు గౌరవించి వారిహక్కులను కాపాడాలన్నారు. సుఖవ్యాధులు, హెచ్ఐవీ అరికట్టటంలో వారు కూడా భాగస్వామ్యులు కావటం మంచి పరిణామని అన్నారు. సౌమ్య నాయిక, ఎస్ఆర్‌కేటీ చాందిని, అంకిత మాట్లాడగా పీఎం ఉదయరాజు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

యడ్లపాడులో వంతెనపై నుంచి పడి ఇరువురికి తీవ్ర గాయాలు


సర్వీసు రోడ్డులో పడి తీవ్రగాయాలైన అజయ్


ఒడిశాకు చెందిన వలస కార్మికుడు

యడ్లపాడు: సినీ తరహాలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... సత్తెనపల్లికి చెందిన ఆళ్ల అజయ్ ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు ప్రయాణిస్తుండగా, యడ్లపాడు గ్రామంలోని ఎర్రకొండ వద్ద హైవే వంతెనపై నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. వేగంగా ఉన్న బైక్ అదుపతప్పి వంతెన గోడను బలంగా ఢీకొంది. దీంతో గాల్లోకి ఎగిరిన ఆజయ్ వంతెన పైనుంచి కింద ఉన్న సర్వీసు రోడ్డులోకి వచ్చి పడ్డాడు. ఈ ప్రమాదంలో బైక్‌కు అడ్డు వచ్చిన వ్యక్తితో పాటు సర్వీసులో పడిపోయిన యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన వారిని 108 వాహనం ద్వారా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని వివరాలను సేకరించారు. రోడ్డు దాటుతూ బైక్ తగిలి గాయపడ్డ వ్యక్తి సమీప నూలుమిల్లులో పని చేసే ఒడిశాకు చెందిన వలస కార్మికుడిగా పోలీసులు భావిస్తున్నట్లు ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు


బైకు యాత్రలో పాల్గొన్న నాయకులు

నూజెండ్ల: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కారమై జరుగుతున్న బైకు యాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు కోరారు. ఉపాధి పథకంలో కూలీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న బైకు ర్యాలీ మంగళవారం నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఆరు వారాలుగా వేతనాలు జమ కావటం లేదని పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించటం లేదన్నారు. ఈనెల 5న ర్యాలీ ముగింపు జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు జరుగుతున్న వాటి గురించి జిల్లా ఉపాధి పీడీ దృష్టికి తీసుకొని వెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం మండల ఏపీవో ఆంజనేయరాజు కలిసి ఉపాధి కూలీల సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జల్లా అధ్యక్షులు రోశయ్య, నాగేశ్వరరావు, భరత్, ఆశార్వాదం, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి ధర కల్పించకపోతే ఆత్మహత్యలు తప్పవు

ఎమ్మెల్యే చదలవాడ ఎదుట రైతుల ఆవేదన


మిరప పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: మిర్చి ధర ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుందని రైతులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గురవాయపాలెంలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పర్యటించారు. ఈ సందర్భంగా మిర్చి కల్లాల వైపు నుంచి వెళ్తున్న ఎమ్మెల్యేను పలువురు రైతులు కలిసారు. మిర్చి రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం క్వింటా మిర్చిని రూ.12 వేలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. క్వింటా మిర్చి కోసేందుకు కూలీలకు రూ.8 వేలు ఖర్చు అవుతుందని, ఆరబెట్టి తాలు కాయలు వేరుచేసి యార్డ్‌కు తరలించేందుకు మరో రూ.2 వేలు ఖర్చు అవుతుందని వివరించారు. దీనికే రూ.10 వేలు ఖర్చు అయితే వ్యవసాయ పెట్టుబడులు, రైతుల కష్టం అంతా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గతంలో క్వింటా రూ.18 వేలు వరకు ధర ఉందని, అదే ధర రైతులకు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మిర్చి రైతుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. రెండు నెలల్లో మిర్చి ధర పెరిగే అవకాశం ఉందని రైతులు అధైర్య పడవద్దని సూచించారు.

కేసానుపల్లి, గుంటగార్లపాడు రైతులకు న్యాయం చేయండి

నరసరావుపేట: నకరికల్లు అడ్డరోడ్డు నుంచి చీరాల ఓడరేవు వరకు నిర్మిస్తున్న 167–ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన గుంటగార్లపాడు, కేసానుపలి రైతులకు జొన్నలగడ్డ గ్రామ రైతుల మాదిరిగానే నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయా గ్రామాల రైతులతో కలిసి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తనకు పదిరోజుల సమయం ఇస్తే తగిన న్యాయం చేస్తానని జేసీ తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జొన్నలగడ్డ గ్రామ రైతులు నష్టపోయిన భూమి విలువ ప్రైవేటుగా ఎకరా రూ.1.5 కోట్లు ఉంటుందని, అదే లెక్కన ప్రభుత్వం వారికి నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించిందన్నారు. అదేవిధంగా వాణిజ్య ప్రాంతాల్లో ఉన్న గుంటగార్లపాడు, కేసానుపల్లి గ్రామరైతుల పొలాలకు సైతం అదేవిధమైన నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భూములు కోల్పోయిన ఆయా గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పశువుల తొట్ల నిర్మాణ పనులకు శ్రీకారం


ఇర్లపాడు భూమి పూజలో పాల్గొన్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: వేసవికాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి నిధులతో నీటి వసతి ఉన్న ఏరియాలో పశువుల తొట్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మతుకుమల్లి, ఇర్లపాడు గ్రామపంచాయతీలో పశువుల నీటితొట్లు పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని ఇర్లపాడు గ్రామంలో ఎంపీడీవో సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ మండలంలోని నాలుగు గ్రామపంచాయతీలు ఇర్లపాడు, మతుకుమల్లి, శానంపూడి, శావల్యాపురం గ్రామాల్లో పశువుల తొట్లు ఏర్పాటు చేయటానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో పశువుల తొట్టి రూ.32 వేలు కాగా 5 మీటర్ల పొడుగు, 2 అడుగల వెడల్పు, 2అడుగల ఎత్తుతో కూడిన పశువుల తొట్లు నిర్మాణ పనులు పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెలగపూడి రమాదేవి, యలగాల బసవయ్య,ఏపీవో కె.రామారావు పీల్డ్ అసిసెంట్స్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల మిర్చి చోరీ


నూజెండ్ల: మిర్చి కల్లంలో గుర్తు తెలియని వ్యక్తులు 12 క్వింటాళ్ల మిర్చి చోరీ చేసిన సంఘటన మండలంలోని పాత ఉప్పలపాడు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు మీసాల నాగేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు మూడు ఎకరాల కౌలుకు తీసుకొని మిర్చి పంటను సాగు చేసినట్లు తెలిపారు. మిర్చి పంట కోత పనులు పూర్తి అయ్యేసరికి రాత్రి అయిందని ఈక్రమంలో మరుసటిరోజు గోతాల్లో తీసుకొని వెళదామనే ఉద్దేశ్యంతో ఇంటికి వచ్చినట్లు బాధితుడు వాపోయాడు. ఉదయానే మిర్చి కల్లం దగ్గరకు చూడగా చోరీకి గురైనట్లు గుర్తించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. రూ. ఒక లక్ష 50 వేలు రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితుడు పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. చేతికి వచ్చిన పంట తీరా దొంగల రూపంలో దోచుకుపోవటం అన్నదాతలు తీవ్ర అవేదనకు గురైయ్యాడు. గత ఏడాది గుర్రప్పనాయుడుపాలెం ఇలాంటి సంఘటన చోటు చేసుకోవటం గమనార్హం. ఇలాంటి చోరీలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై యంవీ కృష్ణారావు పరిశీలించి బాధిత రైతుతో మాట్లాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



వినుకొండ: పట్టణంలోని పల్నాడు రోడ్డు ప్రకాష్ గుడ్ లక్ స్టోర్స్ సమీపంలో కాషాయం రంగు ధరించిన వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో మార్చురీకి తరలించారు. వివరాలకు వినుకొండ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో శోభన్ బాబు తెలిపారు.

ఫ్యాప్టో ధర్నా జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పాఠశాలల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. 12 పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియామకం చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాలన్నారు. పీఆర్సీ చైర్మన్ నియామకం ఆలస్యమైన నేపథ్యంలో 30 శాతం మధ్యంతర భృతి వెంటనే చెల్లించాలన్నారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలు అమలు చేయాలని, కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వినుకొండ అకయ్య, పీవీ భీష్మారావు, షేక్ నాగుర్‌వలి, ఎం శారద, మేకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రీడింగ్ ఈజ్ ఫన్‌డే కార్యక్రమం



రీడింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు

నూజెండ్ల: మండలంలోని పెద్దావరం గ్రామం ఎంపీపీ స్కూల్లో రీడింగ్ ఈజీ ఫన్ డే కార్యక్రమాలు మంగళవారం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఘంటా నాగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలల వేసి పాఠశాల గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను ప్రదర్శించారు. పుస్తక పఠనం వలన కలుగే ప్రయోజనాలు వివరించి విద్యార్థులచే కథల పుస్తకాలను చదివించారు. హాస్యపు పుస్తకాలు, ఫజిల్స్ తమషా కథలతో కూడిన పుస్తకాలను పరిచయం చేస్తూ చదవటం కూడా ఆధునిక వినోదం సరదాగా ఉంటుందని పిల్లలకు చూపించడమే రీడింగ్ ఈజ్ ఫన్నీడే లక్ష్యం అన్నారు.